

ప్రజావాణిలో 37 ఫిర్యాదులు స్వీకరించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య,ఐ.పి.యస్.

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 2:

నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. ఫిర్యాదుదారుల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన బాధితుల సమస్యలను ఆయన ఓపికగా విని, వాటిని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణికి వచ్చిన వివిధ సమస్యలపై స్పందించిన సీపీ, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల సి.ఐ, ఎస్.ఐ లతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సమస్యల తీవ్రతను బట్టి వాటి స్థితిగతులను అడిగి తెలుసుకుంటూ, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 37 ఫిర్యాదులను స్వీకరించినట్లు ఆయన తెలిపారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా, స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. బాధితుల సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకే ప్రతి సోమవారం ఈ ప్రజావాణి కార్యక్రమం ద్వారా నేరుగా ఫిర్యాదులను స్వీకరిస్తూ, సమస్యలను పరిష్కరిస్తున్నామని సీపీ పి. సాయి చైతన్య వివరించారు.

ఓటు హక్కుప్రసాదించిన అంబేడ్కర్ నివాసానికి మహిళామణులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 2:

భారత దేశ పౌరులందరికీ ఓటు అనే ముఖ్య ఆయుధాన్ని అందజేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ నివసించిన రాజగృహాన్ని తెలుగు మహిళలు సందర్శించారు. ఐతే ఈ సందర్భంగా ఆదివారం తూర్పు దాదర్లో ఉన్న



రాజగృహకి తెలంగాణ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన మాజీ సాక్షి మహారాష్ట్ర ఎడిటర్, ముంబై తెలంగాణ జాక్ (ఎంటిజెఏసి) కోఆర్డినేటర్ సిర్పా గంగాధర్ సందర్శించడం విశేషం. ప్రతి మానవుడు తన కుటుంబ సంసారం కోసం నివాసం నిర్మించుకుంటే, అంబేడ్కర్ మాత్రం తాను చదివిన యాభైవేల పుస్తకాల కోసం ఇల్లు ఏర్పరచుకోవడం ప్రపంచంలో ఏకైక మహనీయులని గంగాధర్ కొనియాడారు. రాజగృహ పుస్తకాల ఖని అని, దేశానికే ఆదర్శమైన నివాసమని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సావిత్రిమాయి పూలే పేరున "ఆదర్శ టీచర్" అవార్డు గ్రహీత మచ్చ సుజాత, సామాజిక క్రియాశీల నాయకురాండ్లు బడా విజయ, శారద పవన్, అనురాధ దుడుక, బైరి అన్నపూర్ణ, గజేంగి హరిత, దాసరి లక్ష్మీ, సురుకుట్ల రాజమణి, గుండేటి శాంత, పేర్ల రుక్మిణి తదితర మహిళామణులతోపాటు ఎంటిజెఏసి క్రియాశీల నాయకులు కొరగొని ప్రభు మహరాజ్, మామిడి సత్తయ్య పద్మశాలి, మూలనివాసి మాలజీ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపి బట్టాపూర్ గ్రామ ప్రజాప్రతినిధులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 02 :

గ్రామ స్మశానవాటిక సమస్యను పరిష్కరించి, విద్యుత్ లైన్ మరియు పోల్స్ మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీకి బట్టాపూర్ గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు సోమవారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ గ్రామ సర్పంచ్ భూషవేణి ప్రవీణ్ యాదవ్, ఉపసర్పంచ్ మూడ్ దయానంద్ మరియు వార్డు సభ్యులు ఈ మేరకు కలెక్టర్‌కు ధన్యవాదాలు ప్రకటించారు. ప్రజావాణి దరఖాస్తుకు స్పందన ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మాట్లాడుతూ.. గ్రామ శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైకుంఠ ధామం (స్మశాన వాటిక) వద్ద గత కొంతకాలంగా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమం ద్వారా పలుమార్లు దరఖాస్తులు సమర్పించినట్లు వారు పేర్కొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన – సమస్య పరిష్కారం:

గ్రామస్థుల వినతిపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ, తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి అధికారులు బట్టాపూర్ గ్రామ క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్య తీవ్రతను పరిశీలించారు. అనంతరం స్మశాన వాటికకు విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన లైన్ మరియు పోల్స్‌ను తక్షణమే మంజూరు చేశారు.

దీనిపై బట్టాపూర్ గ్రామ ప్రజలు, యువకులు, వార్డు సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజల సమస్యను వేగంగా పరిష్కరించిన జిల్లా కలెక్టర్‌కు, అలాగే ఇందుకు సహకరించిన సంబంధిత అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



బెస్ట్ అవైలబుల్ స్కీంలో ప్రైవేటు విద్యాసంస్థల అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేసిన అదనపు ఫీజులను వెంటనే తిరిగి ఇప్పించాలి -- PDSU వినతి



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 2:

నిజామాబాద్ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం అమలులో జరుగుతున్న అక్రమాలు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విషయంపై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU) ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ సురేష్ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ్రాణూఖ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కర్క గణేష్, ప్రధాన కార్యదర్శి ఎల్. అనిల్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థల్లో వసతితో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో బెస్ట్ అవైలబుల్ స్కీంను ప్రవేశపెట్టిందని, అయితే ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యాన్ని కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. 2020-21 విద్యాసంవత్సరం నుంచి ప్రస్తుత విద్యాసంవత్సరం వరకు ప్రభుత్వం సంబంధిత శాఖల ద్వారా ప్రైవేటు విద్యాసంస్థలకు విద్యార్థుల ఫీజుల నిధులను విడుదల చేసినప్పటికీ, తమకు ప్రభుత్వం నుంచి నిధులు అందలేదని చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ప్రతి సంవత్సరం అదనంగా ఫీజులు వసూలు చేశారని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన తర్వాత తల్లిదండ్రులు చెల్లించిన డబ్బులను తిరిగి ఇస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం ఆ డబ్బులను తిరిగి ఇవ్వకుండా యాజమాన్యాలు కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా నిజామాబాద్ నగరంలోని విజ్ఞాన్ హైస్కూల్ యాజమాన్యం బెస్ట్ అవైలబుల్ స్కీంలో చదువుతున్న అనేకమంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి గత నాలుగు సంవత్సరాలుగా ఒక్కో విద్యార్థికి సుమారు రూ.30 వేల నుంచి రూ.32 వేల వరకు అదనంగా వసూలు చేసిందని, ప్రభుత్వం నుంచి ఫీజుల నిధులు యాజమాన్యం ఖాతాలో జమ అయినప్పటికీ తల్లిదండ్రులకు డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని పేర్కొన్నారు.అదేవిధంగా బెస్ట్ అవైలబుల్ స్కీంలో చదువుతున్న విద్యార్థులకు హాస్టళ్లలో సరైన వసతులు కల్పించకుండా, నాణ్యమైన భోజనం అందించకుండా కొన్ని విద్యానంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించాల్సిన వథకాన్ని ప్రైవేటు యాజమాన్యాలు ఆదాయ వనరుగా మార్చుకోవడం దుర్మార్గమని విమర్శించారు.జిల్లా అధికారులు వెంటనే స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీం అమలవుతున్న అన్ని విద్యానంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, హాస్టల్ వసతులు, భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల నుంచి అక్రమంగా వసూలు చేసిన అదనపు ఫీజులను వెంటనే తిరిగి ఇప్పించాలని, ప్రభుత్వ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాసిర్, సహాయ కార్యదర్శి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

బీసీ కులగనణ చేస్తరో...

లేదంటే గద్దె దిగుతరో కేంద్రం తేల్చుకోవాలి

- బీసీలను మోసం చేస్తున్న అమిత్ షా - కేంద్ర హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలి

- ఓబీసీ కాలం చేర్చకపోతే బిజెపికి బీసీలే ఫోరీ కడతరు

- బీసీల ఓట్లు వేయించుకున్న కిషన్ రెడ్డి బీసీల గురించి మాట్లాడకపోవడం సిగ్గుచేటు

- బిజెపిలో చీము నెత్తురు ఉన్న బీసీలు మోదీ, అమిత్ షాలపై తిరగబడాలి

- బిజెపి జాతీయ నేతలు ఇకపై రాష్ట్రానికి ఎవరు వచ్చిన వారి పర్యటనలను అడ్డుకుంటాం

- అమిత్ షా హైదరాబాద్ పర్యటన సందర్భంగా జరిగిన నిరసనలో నిప్పులు చేరిగిన జాజుల



హైదరాబాద్ నవంబర్ 2
(ప్రజాకలం ప్రతినిధి)

బీసీ కులగణనన చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన బిజెపి పార్టీని వచ్చే ఎన్నికల్లో బీసీలే రాజకీయంగా ఆ పార్టీకి గోరికట్టడం ఖాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఫైర్ అయ్యారు. నేడు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనను నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ అంబర్ పేటలోనీ మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన ధర్నా చేపట్టారు.ఈ నిరసన ధర్నాలో జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరై మాట్లాడుతూ దేశంలోని 80 కోట్ల మంది బీసీల ప్రగాఢ ఆకాంక్ష అయిన బీసీ కులాల లెక్కలు చేపట్టాలని దశాబ్దాలుగా పోరాటం చేస్తుంటే ఎన్నికలలో లబ్ధి పొందడానికి బీసీ కుల గణన చేస్తామని కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించి, తీరా జనగణన చేపడుతున్న ఈ సందర్భంలో ఓబీసీ కాలం చేర్చకుండా బీసీలకు బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యా యం చేస్తుందని ఆయన ఆరోపిం చారు.బీసీ కులాల లెక్కలు లేకుంటే బీసీలకు భవిష్యత్తు లేదని, బీసీలు విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో అస్తిత్వం కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్నా బీసీల ఓట్లతో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు పార్లమెంట్ సభ్యునిగా,కేంద్ర మంత్రిగా అయిన జి.కిషన్ రెడ్డి కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. బీసీలను మోసం చేసిన కేంద్ర మంత్రులకు దేశంలో ఎక్కడ కూడా పర్యటించే అర్హత లేదని, భవిష్యత్తులో బిజెపి జాతీయ నేతలు కేంద్ర మంత్రులు తెలంగాణలో వ్యక్తిగతంగా వస్తే ఖచ్చితంగా అడ్డుకొని తీరుతామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు, బీసీ కులగనన చేపట్టడం చేతకాకపోతే కేంద్ర హోంశాఖ పదవికి అమిత్ షా తక్షణమె రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు చారిత్రాత్మకంగా ఇంత అన్యాయం చేస్తున్న బిజెపి అధిష్టానంపై బిజెపిలో ఉన్న చీము నెత్తురు ఉన్న బీసీ నేతలు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా లపై తిరుగుబాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ కాలం చేర్చే వరకు, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచే వరకు కేంద్ర ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తి లేదని,డిసెంబర్ 14,15 తేదీలలో ఢిల్లీనీ వేలాది మందితో ముట్టడించి బీసీల తడాఖా ఎట్లుంటదో బిజెపి ప్రభుత్వానికి రుచి చూపిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు . ఈ ఆందోళన కార్యక్రమంలో బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, కుందారం గణేష్ చారి,గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్,కనకాల శ్యాం కుర్మా,పిట్ల శ్రీధర్, ఉప్పరి శేఖర్ సగర, మురళి కృష్ణ, కాటేపల్లి వీరాస్వామి,జాజుల లింగం గౌడ్, గొడుగు మహేష్ యాదవ్,ఈడిగ శ్రీనివాస్ గౌడ్, రావులకోల్ నరేష్ ప్రజాపతి,కెవి గౌడ్, కౌల జగన్నాథం, గూడూరు భాస్కర్ మేరు, గోధ వరుణ్ కుమార్ గౌడ్, తారకేశ్వరి, సంధ్యారాణి, గౌతమి,ఇంద్రం రజక, కొవ్వుల చందుగౌడ్, గజ్జెల సత్యరాజ్ గౌడ్, సిద్ధాంతం శ్యామల,గుంటి మహేష్,దేవిక, శ్రావణి,అంజమ్మ, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు..

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి ఘనంగా వీడ్కోలు

సీఐ, ఎస్సై సమక్షంలో ఘనంగా సన్మానం

బీబీనగర్, నవంబర్ 02 (ప్రజాకలం): విధి నిర్వహణలో ప్రజలతో మమేకమై, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన బీబీనగర్ ఎస్ఐ రమేష్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా మండల నాయకులు, యువకులు, సామాజిక కార్యకర్తలు, ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో చొరవ చూపడంతోపాటు గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారని కొనియాడారు. యువతకు అవగాహన కల్పిస్తూ, నిరుద్యోగులకు మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో సత్కరించి నూతన



బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో సిఐ సూర్య నాయక్, ఎస్సై తేజం రెడ్డి, మండల నాయకులు ఎండీ అక్బర్, ఎండీ మెయిన్, కాసుల రఘునందన్ గౌడ్, తుమ్మల నరసింహ రెడ్డి, ఎలుగుల నరేందర్, పొట్ట నవీన్,దేవరుప్పుల శ్రీధర్, రవి, కాసుల అజయ్ కుమార్,పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధుల ఖర్చులో పారదర్శకత పాటించాలి

- వస్తువులు, సేవల కొనుగోలు నిబంధనలపై ఎయిమ్స్ సిబ్బందికి అవగాహన

-జెమ్ విధానాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

బీబీనగర్,నవంబర్ 02 (ప్రజాకలం): విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్--2026లో భాగంగా 'సమృద్ధికి నిజాయితీ పునాది' అనే నినాదంతో ఎయిమ్స్‌లో విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 30న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వస్తువులు, సేవల కొనుగోళ్లలో జెమ్ విధానాలు, విజిలెన్స్ నిబంధనలపై సిబ్బందికి అవగాహన



కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ ఈ-మార్కెట్ శిక్షకురాలు జి. సరిత హాజరయ్యారు. ప్రభుత్వ, కార్పొరేట్ రంగాల్లో పదేళ్లకు పైగా అనుభవం కలిగిన ఆమె సిబ్బందికి పలు కీలక అంశాలపై శిక్షణ ఇచ్చారు. వస్తువులు, సేవల కొనుగోలు విధానాలు, నిబంధనల అమలు, సాంకేతిక అర్హతల నిర్ధారణలో పారదర్శకత, విజిలెన్స్ పర్యవేక్షణ, కొనుగోళ్ల ప్రక్రియలో ఎదురయ్యే నష్టాల నివారణ చర్యలను వివరించారు.ప్రభుత్వ వైద్య సంస్థల్లో వస్తువులు, సేవల కొనుగోళ్లు కేవలం పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాదని, ప్రజాధనాన్ని సమర్థంగా వినియోగించడం, వైద్య సేవల సామర్థ్యాన్ని పెంపొందించడం, ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టడం వంటి అంశాలతో ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని, నిబంధనల ఉల్లంఘనలను నివారించడంలో ప్రతి విభాగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం ముఖ్య అతిథి జి. సరితను ఘనంగా సత్కరించి, కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, పరిపాలనా సిబ్బంది, నిర్వాహక బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయిమ్స్ సీనియర్ అధ్యాపకులు, పరిపాలనా విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్గొండలో జరిగే రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలి

- సీపీఎం పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు

బీబీనగర్,నవంబర్ 02 (ప్రజాకలం): నల్గొండలో ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను



విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు కోరారు. సోమవారం స్థానిక రహదారి బంగ్లాలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన పోరాటం దేశవ్యాప్తంగా స్ఫూర్తిగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను జాతీయ మహాసభల్లో రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15న నిర్వహించే బహిరంగ సభకు రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు దండబోయిన శ్రీశైలం, పంజాల జంగయ్య, కుమ్మరి రాజు, పాశం బాలయ్య, ఓవల్‌దాస్ శంకర్, చెట్టబోయిన కనకయ్య పాల్గొన్నారు.

కోమటికుంట చెరువులో వాసవి కన్స్ట్రక్షన్స్ అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి - ఆకుల సతీష్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) బాచుపల్లి పరిధి కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్ , బఫర్ జోన్ పరిధిలో వాసవి కన్స్ట్రక్షన్స్‌కు చెందిన 8, 9వ బ్లాకుల్లో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆకుల సతీష్ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఉత్తర్వుల ప్రకారం సంబంధిత అధికారులు సమగ్ర చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, హైడ్రా అధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు, వివాదాస్పద హెచ్‌ఎండీఏ ఉత్తర్వులను ఆధారంగా చేసుకుని నిర్మాణ పనులు తిరిగి కొనసాగుతున్నాయనే అంశంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జాయింట్ సర్వే నిర్వహించాలని హైడ్రా అధికారులు ఏప్రిల్‌లో సంబంధిత శాఖలకు లేఖలు రాసినా స్పందన లేకపోవడంపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బాచుపల్లి సాయినగర్‌లోని సర్వే నంబర్ 186లో సుమారు 11 గుంటల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు సర్వే చేసి గుర్తించిన నేపథ్యంలో, ఆస్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కాపాడటంతో పాటు ప్రజా ప్రయోజనాల కోసం కమ్యూనిటీ అవసరాలకు కేటాయించాలని మరో ఫిర్యాదు సమర్పించారు. కొంపల్లి సర్వే నంబర్ 100లోని ఆర్మీ భూమి ఆక్రమణ ఆరోపణలపై నిర్వహించిన సర్వే నివేదికను ఇప్పటివరకు అందించకపోవడంపై విచారణ జరిపి, సర్వే నివేదికను అందించాలని, ఆక్రమణలు జరిగితే ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు, ప్రజా ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యం వీడి చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో అరుణ్ రావు, మాధవ రావు, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.





చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరసంఘం, నవంబర్ 2 (ప్రజా కలం ప్రతినిధి)

ఝరసంఘం 9వ వార్డు సభ్యుడు నవీన్ కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఝరసంఘం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సంగమేశ్వర్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జగదీష్, సర్పంచ్ వినోద బాల్‌రాజ్, ఉపసర్పంచ్ అనిల్, తుమ్మన్‌పల్లి సర్పంచ్ సోహెల్, నాయకులు శశివర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్, సజ్జన్, విజయ్, ఉల్లాస్, సాగర్ తదితరులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



బచ్చన్ ప్లే స్కూల్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) విద్యార్థుల ఆరోగ్యమే మా ప్రాధాన్యత అనే లక్ష్యంతో చింతల్, వెంకటేశ్వర నగర్ లోని బచ్చన్ స్కూల్‌లో పాఠశాల చైర్మన్ టివిఆర్.కోటిరెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈనేపథ్యంలో ఉద్భవ్ పీడియాట్రిక్ అండ్ పాలీక్లినిక్‌కు చెందిన పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సాహితి(ఎమ్.బిబిఎస్. ఎమ్.డి) విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా చిన్నారుల తల్లిదండ్రులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు మంచి అవకాశం లభించింది. తల్లిదండ్రులు ఈ ఉచిత ఆరోగ్య పరీక్షల అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అర్హులైన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకోవాలి

-ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ప్రజాకలం/మేడ్చల్ జిల్లా (ప్రతినిధి)

శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు సంబంధిత నాయకులతో చందానగర్, మక్తా-మియాపూర్ డివిజన్ల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి అతిథులుగా కూకట్పల్లి నియోజకవర్గ శాసన సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరైయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించి, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గత పట్ట భద్రుల ఓట్ల జాబితా ఆధారంగా పూర్తి వివరాలు సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరు గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో ఓటర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నాయకులు అభిమానులు కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలసి పని చేయాలని సూచించారు. మన ఇళ్లలోని పట్టభద్రులతోపాటు కాలనీ, డివిజన్ తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదు చేపించాలి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుంచి ప్రారంభమవ్వాలి. గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు తిరిగి ఓటర్ నమోదును చేపించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి 70 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్నికలెప్పుడు వస్తాయి, కేసీఆర్ ని మళ్లీ ముఖ్యమంత్రి ఎప్పుడూ చేస్తామని ప్రజలు చూస్తున్నారు. నేడు ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి కృషిచేయాలన్నారు.ఈసమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత నాయకులు పాల్గొన్నారు.



ప్రగతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని కబ్జా నుండి కాపాడాలి:

సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) నిజాంపేట్ సర్కిల్ పరిధి ప్రగతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంబంధించిన స్థలం కొంత మంది కబ్జాదారులు అట్టి స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, సీపీఐ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించారు. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రగతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీసీ,ఎస్సీ,ఎస్టీ బడుగు బలహీన వర్గాల పిల్లలు దాదాపు 556 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఆ పాఠశాల ఆట స్థలంపై కొంత మంది కన్ను పడిందని దాదాపు ఎకరం పాఠశాల స్థలం కబ్జా చేసే ప్రయత్నంలో వున్నారని వారికీ సమాచారం వచ్చిందని అన్నారు. గబ్బిలపేట్ లోని ప్రభుత్వ పాఠశాల పై సీపీఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. పేద ప్రజలకు విద్య, వైద్యం ఉచితం చేస్తే సరిపోతుందన్నారు. బాచుపల్లి మండల పరిధిలో ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడం అయిపోయిందన్నారు. చెరువుల కబ్జాచేయడం గుట్టలు, పుట్టలు కబ్జా చేయడంతో పాటు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలపై కబ్జాదారుల కన్ను పడిందన్నారు. కనుక ప్రగతినగర్ ఉన్నత పాఠశాల ఆట స్థలం కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. సీపీఐ గా మేము కలెక్టర్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి ప్రజా శ్రేయస్సు కోరే ప్రతి ఒక్కరిని కలుపుకొని పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ బాచుపల్లి మండల నాయకులు ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, కె.మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కేబుల్ టీవీ జర్నలిస్టులు

- ఐఅండ్ పీఆర్ కార్యాలయం ఎదుట ధర్నా -కమీషనర్ ఛాంబర్ ముందు బైఠాయింపు

-ఆందోళనలో పాల్గొన్న టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

-సమస్యను వెంటనే పరిష్కరించాలి -టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 2 (ప్రజా కలం ప్రతినిధి)

కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళ పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న అణిచివేత వైఖరికి నిరసనగా అనేకమంది కేబుల్ ఛానళ్ళ జర్నలిస్టులు హైదరాబాద్ మానబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార భవన్(ఐఅండ్ పీఆర్ కమీషనర్ కార్యాలయం) ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. తెలంగాణ కేబుల్ ఛానల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టులు ఐఅండ్ పీఆర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కమీషనర్ రావాలని పట్టుపట్టిన కేబుల్ ఛానళ్ళ నిర్వహకులు,జర్నలిస్టులు ఒక్కసారిగా పోలీసుల వలయాన్ని చేదించుకొని కార్యాలయంలోకి దూసుకెళ్ళారు. కమీషనర్ ఛాంబర్ ముందు బైఠాయించి నినాదాలు చేస్తున్న జర్నలిస్టులను పోలీసులు బలవంతంగా బయటకు తరలించారు. అంతకుముందు ధర్నాలో పాల్గొన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, కేబుల్ ఛానళ్ళ పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనుచిత వైఖరిని ఖండించారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక ఏళ్ళుగా నడుస్తున్న కేబుల్ ఛానళ్ళకు ఐపీ ఛానళ్ళ పేరుతో అక్రెడిటేషన్లు



ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని ధ్వజమెత్తారు. చిన్న పత్రికలను, కేబుల్ ఛానళ్ళ సంఖ్యను కుదించాలనే కుట్రలో భాగంగానే ఇటీవల ఇంటర్నెట్ ప్రోటోకాల్(ఐపీ) నెట్వర్క్ ద్వారా నడుస్తున్నాయనే సాకుతో అనేక కేబుల్ ఛానళ్ళకు, వాటిలో పని చేస్తున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అన్యాయం చేశారని అన్నారు. అక్రెడిటేషన్ కార్డుల జారీలో అనేక అవకతవకలు జరిగాయని, లక్షల రూపాయల పెట్టుబడితో నడుపుతున్న అసలైన కేబుల్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారని వారు ఆరోపించారు. కేబుల్ ఛానళ్ళకు గతంలో జిల్లాకు నాలుగు కార్డులు, రాష్ట్ర స్థాయిలో 12 కార్డులు ఉండగా వీటిని సగానికి తగ్గించారని అన్నారు. కేబుల్ ఛానళ్ళకు ఒకవైపు ప్రభుత్వం నుంచి ఎటువంటి అడ్వర్టయిజ్మెంట్లు, ఇతర సబ్సిడీలు గానీ లేకపోవడం, మరోవైపు కనీసం అక్రెడిటేషన్ కార్డులు కూడా లేకపోవడం వల్ల అనేక చానళ్ళ మూతపడే పరిస్థితి నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిజం వృత్తి పై ఆధారపడి ఎన్నో ఏళ్ళుగా కేబుల్ ఛానళ్ళు నడుపుతున్న వేలాది మంది జర్నలిస్టులను ప్రభుత్వం రోడ్డున పడేస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా తమ ప్రభుత్వం జర్నలిస్టులకు 44 వేలకు పైగా అక్రెడిటేషన్లు ఇస్తుందని చెప్పిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి...ఇప్పటి వరకు ఎన్ని అక్రెడిటేషన్లు ఇచ్చారు, ఎవరికి ఇచ్చారు, కేబుల్ ఛానళ్ళకు ఎన్ని ఇచ్చారో వెల్లడించాలని అన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న కేబుల్ ఛానళ్ళకు ఎటువంటి కొర్రీలు పెట్టకుండా న్యాయ బద్దంగా అక్రెడిటేషన్లు ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం లో చిన్న పత్రికలు, కేబుల్ ఛానళ్ళ పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం సరైంది కాదని, ఐపీ ఛానళ్ళ పేరుతో కేబుల్ ఛానళ్ళను మూసివేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకొని అన్ని కేబుల్ ఛానళ్ళకు వెంటనే అక్రెడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్ ఎం. రవికుమార్,గద్వాల జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, కేబుల్ ఛానళ్ళ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



శ్రీ సరస్వతీ దేవి విగ్రహ ఆవిష్కరణ

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

గాజులరామారం జడ్పీహెచ్ హైస్కూల్‌లో శ్రీ సరస్వతీ దేవి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు సరస్వతి దేవి పుత్రులని పిలుస్తారని గుర్తు చేశారు. విద్యతోపాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.



పాఠశాల/ కళాశాలల సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులను నడపాలని కలెక్టర్ కు వినతి-కొడారి వెంకటేష్,

బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు

యాదాద్రి భువనగిరి జిల్లా, నవంబర్ 02,(ప్రజా కలం)

జిల్లాలోని పాఠశాలలు/ కళాశాలల పనివేలలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు కొడారి వెంకటేష్ కోరారు. సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి కి ఎస్.ఆర్.కళాశాల విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొడారి వెంకటేష్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట డిపో నుండి గతంలో ఉదయం 7 గంటలకు ఆర్టీసీ బస్సు బయలుదేరి సైదాపూర్, మాసాయిపేట, గౌరాయపల్లి, రఘునాధపురం మీదుగా కాచారం,కంఠం గూడెం మీదుగా ఆలేరు కి ఉదయం 9 గంటల వరకు చేరుకునేదని ఆయన అన్నారు. దీంతో విద్యార్థులు పాఠశాల/ కళాశాలలకు సమయానికి వెళ్ళేవారని ఆయన అన్నారు. యాదగిరిగుట్ట డిపో ఆర్టీసీ అధికారులు బస్సుల సమయాలను మార్చడంతో ప్రస్తుతం ఉదయం 9గంటలకు యాదగిరిగుట్ట నుండి ఆర్టీసీ బస్సు బయలుదేరడంతో విద్యార్థులు పాఠశాల/ కళాశాల లకు సమయానికి వెళ్ళలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఇట్టి విషయమై యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి వెంటనే స్పందించి డిపో మేనేజర్ తో మాట్లాడి పాఠశాల/కళాశాల సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులను నడపే విధంగా ఆర్టీసీ అధికారులను ఆదేశిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని వెంకటేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన వారిలో విద్యార్థులు కే.హారిక,ఐ.చరిత, ఆర్.వాణీ,ఎస్.శ్రీవాణి, ఎస్.సోనీ,బి.ప్రవల్లిక, జి. ఈక్షిత ,కే.సాత్విక, బి.రిషిక తదితరులు పాల్గొన్నారు.

బీబీనగర్ ఎస్సై రమేష్‌కు ఆత్మీయ వీడ్కోలు



బీబీనగర్, నవంబర్ 02 (ప్రజాకలం): బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఎస్సై రమేష్‌కు గొర్రె, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ప్రజలకు మంచి సేవలు అందించినందుకు ఎస్సై రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సేవలను అభినందిస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీబీనగర్ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి లక్ష వితరణ

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి నెహ్రూ నగర్ వాసి సిహెచ్ ప్రశాంత్ .1,00,116/- లక్ష నూట పదార్లు రూపాయల విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులకు నగదు రూపంలో అందజేసి దాతృవాన్ని చాటారు. వారి కుటుంబానికి భక్త ఆంజనేయ స్వామి వారి ఆశీసులు ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, సభ్యులు రవి, అంజి పాల్గొన్నారు.



పరిశుభ్రత కార్యక్రమంతో మలబార్ డే వేడుకలు

బీబీనగర్ ఎయిమ్స్ బస్‌స్టాప్ వద్ద పారిశుధ్య కార్యక్రమం

దేశవ్యాప్తంగా 9 వేల మందికి పైగా ఉద్యోగులతో సేవా కార్యక్రమాలు

మేడిపల్లి, నవంబర్ 2 (ప్రజా కలం ప్రతినిధి)

మలబార్ గ్రూప్ 34వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మేడిపల్లి పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్ బస్‌స్టాప్ వద్ద పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మేడిపల్లి షోరూమ్ ప్రతినిధులు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, సుపరిపాలన (ఈఎస్‌జీ) సూత్రాలను ప్రోత్సహించడంలో భాగంగా మలబార్ గ్రూప్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ భారీ పారిశుధ్య కార్యక్రమంలో గ్రూప్‌కు చెందిన 9 వేల మందికి పైగా ఉద్యోగులు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి. అహమ్మద్ మాట్లాడుతూ వ్యాపార కార్యకలాపాలతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, పారదర్శకత, నైతిక విలువలకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సుస్థిర అభివృద్ధిలో భాగంగా వచ్చే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.సమాజ శ్రేయస్సు కోసం మలబార్ గ్రూప్ నిరంతరం పలు సేవా కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. హంగర్ ఫ్రీ వరల్డ్, పేద విద్యార్థుల కోసం మైక్రో లెర్నింగ్ సెంటర్లు, బాలికలకు ఉపకార వేతనాలు, వృద్ధ మహిళల కోసం గ్రాండ్ హోమ్స్ వంటి కార్యక్రమాల ద్వారా సామాజిక అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు.మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ గురించి: 1993లో స్థాపించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రస్తుతం ప్రపంచంలోని ప్రముఖ ఆభరణాల రిటైల్ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. 14 దేశాల్లో 450కు పైగా షోరూమ్‌లతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 30 వేల మందికి పైగా ఉద్యోగులు సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారు. వ్యాపార విస్తరణతో పాటు సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణకు సంస్థ ప్రాధాన్యతనిస్తోంది.



గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి

మాదిగలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి

తెలంగాణ ఉద్యమంతో పాటు వర్గీకరణ పోరాటంలోనూ పాల్గొన్నా

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు పిడమర్తి రవి విజ్ఞప్తి



హైదరాబాద్,
నవంబర్ 2 (ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజికవర్గానికి న్యాయం చేయాలని, త్వరలో భర్తీ చేయనున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానంలో తనకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి కోరారు. ఈ మేరకు ఢిల్లీలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి తన అభ్యర్థనను విన్నవించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు మాదిగల వర్గీకరణ ఉద్యమంలోనూ క్రియాశీలకంగా పనిచేసిన తనకు కాంగ్రెస్ పార్టీలో ఇప్పటివరకు సముచిత గుర్తింపు, రాజకీయ అవకాశం లభించలేదని పిడమర్తి రవి పేర్కొన్నారు.

గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న ఎమ్మెల్సీ స్థానాన్ని మాదిగ సామాజికవర్గానికి కేటాయించి, తనకు శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ చొరవతో మాదిగల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారమైనందుకు ఆ సామాజికవర్గం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వంలోనూ మాదిగలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మహేశ్‌కుమార్ గౌడ్‌ను కోరారు. తెలంగాణ ఉద్యమంలోనూ, వర్గీకరణ పోరాటంలోనూ పనిచేసిన తన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం ద్వారా మాదిగ సామాజికవర్గానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించినట్లవుతుందని పిడమర్తి రవి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఒక్కలగడ్డ చంద్రశేఖర్‌తో పాటు పలువురు మాదిగ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో హత్య కుట్ర భగ్నం

- ఆర్ఫాజ్‌ను హతమార్చేందుకు పథకం.. ఐదుగురు నిందితుల అరెస్ట్

- రెండు నాటు తుపాకులు, 8 తూటాలు, మూడు కత్తులు స్వాధీనం

- పోలీసుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం.. వివరాలు వెల్లడించిన సీపీ సుమతి ఐపీఎస్



మల్కాజిగిరి, నవంబరు 2 (ప్రజా కలం ప్రతినిధి):

పాత కక్షలు, వ్యక్తిగత ప్రతీకారంతో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకున్న ఐదుగురు నిందితులను మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఉప్పల్ పోలీసులతో కలిసి ఎస్‌ఓటీ ఎల్బీనగర్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఈ హత్య కుట్ర వెలుగులోకి వచ్చింది. నిందితుల నుంచి రెండు నాటు తుపాకులు, 8 తూటాలు, మూడు కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సోమవారం నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ వెల్లడించారు.

పెట్రోలింగ్‌లో పట్టుబడిన నిందితులు

ఉప్పల్ శిల్పారామం వెనుక మూసీ నది సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోతో ఐదుగురు వ్యక్తులు అనుమానా స్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద రెండు నాటు తుపాకులు, 8 తూటాలు, మూడు కత్తులు లభించాయి. విచారణలో ఆర్ఫాజ్ అనే వ్యక్తిని హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడైంది.

పాత హత్యలకు ప్రతీకారంగా మరో హత్యకు కుట్ర

పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. దాసరి సురేందర్ అలియాస్ సూరి తన భార్య షబాపై అనుమానంతో ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం 2024లో షబా సోదరుడు సల్మాన్ హత్యకు కూడా సురేందర్ పాల్పడినట్లు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో షబా మరో సోదరుడు ఆర్ఫాజ్ 2026 జూలైలో సురేందర్‌ను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో జైలుకు వెళ్లిన ఆర్ఫాజ్ ఇటీవల విడుదలయ్యాడు. దీంతో సురేందర్‌కు అనుచరులుగా ఉన్న ఐదుగురు అతడిపై ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుని ఆర్ఫాజ్‌ను హతమార్చేందుకు కుట్ర పన్నినట్లు పోలీసుల విచారణలో తేలింది.

బీహార్ నుంచి ఆయుధాల కొనుగోలు

హత్య పథకాన్ని అమలు చేసేందుకు నిందితులు ముందస్తుగా ఆయుధాలను సమకూర్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. తనయ్ కుమార్ అలియాస్ కన్నా, షేక్ అక్బర్ కలిసి ఆదిత్య కుమార్ ఠాకూర్‌కు ఫోన్‌పే ద్వారా రూ. 35 వేలు పంపించారు. అనంతరం ఆదిత్య బీహార్ రాష్ట్రంలోని భాగల్పూర్ జిల్లా సైద్‌పూర్ దబ్రా ప్రాంతానికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తి నుంచి రూ. 30 వేలకు రెండు నాటు తుపాకులు, ఆరు తూటాలు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. వీటితో పాటు మూడు కత్తులను కూడా కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సమయానికి స్పందించిన పోలీసులు.. తప్పిన ఘోరం ఆర్ఫాజ్‌ను హతమార్చే పథకాన్ని అమలు చేసేందుకు ఐదుగురు నిందితులు నవంబరు 2న ఉదయం మూసీ నది సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో సమావేశమయ్యారు. అయితే ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకోవడంతో హత్య కుట్ర భగ్నమైందని సీపీ సుమతి వివరించారు. అరెస్ట యిన నిందితుల్లో తొకట తనయ్ కుమార్ అలియాస్ కన్నా (26) ఉప్పల్‌లో లోన్ రికవరీ ఏజెంట్‌గా, షేక్ అక్బర్ (26) మీర్‌పేటలో ఆటో డ్రైవర్‌గా, ఆదిత్య కుమార్ ఠాకూర్ (33) ఉప్పల్‌లో భద్రతా సిబ్బందిగా, దుడాని లక్ష్మణ్ సింగ్ అలియాస్ సోను (27) కొత్తపేటలో వెల్డింగ్ కార్మికుడిగా, వడ్త్యా వెంకటేశ్ అలియాస్ నాని (22) అల్మాస్‌గూడలో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో లక్ష్మణ్ సింగ్ చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా ఉన్నాడని, అతడిపై గతంలో 30 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, వాటిలో రెండు హత్య కేసులు కూడా ఉన్నాయని వెల్లడిం చారు. అక్రమ ఆయుధాలు కలిగి ఉండటం, వ్యక్తిగత కక్షలతో హత్యలకు కుట్ర పన్నడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సుమతి హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

వ్యాపారానికి ఆర్థిక అస్త్రమే కీలకం..

- గీతంలో ఈనెల 19, 20 తేదీల్లో ప్రత్యేక శిక్షణ..

- నిర్వాహకులు, వృత్తి నిపుణులకు ఆచరణాత్మక ఆర్థిక పాఠాలు..



పటాన్‌చేరు, నవంబర్ 2 (ప్రజా కలం) ప్రతినిధి

వ్యాపార రంగంలో సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన ఆర్థిక పరిజ్ఞానం, నిర్వహణ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఈనెల 19, 20 తేదీల్లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు సంఖ్యల నుంచి వ్యూహం వరకు,నిర్వాహక నైపుణ్యానికి ఆర్థిక పరిజ్ఞానం పేరుతో ఆన్‌లైన్,ప్రత్యక్ష విధానాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

ముఖ్యంగా ఆర్థిక రంగంలో ప్రత్యేక విద్యార్హతలు లేని నిర్వాహకులు,వృత్తి నిపుణులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు ఈ శిక్షణలో ఆర్థిక విశ్లేషణ,వ్యయ నియంత్రణ, బడ్జెట్ రూపకల్పన, పెట్టుబడులపై రాబడి, మూలధన కేటాయింపు వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

వాస్తవ వ్యాపార పరిస్థితుల ఆధారంగా అభ్యాసాలు,పెట్టుబడి అవకాశాల అంచనా, సమర్థవంతమైన నిర్ణయా లపై ఆచరణాత్మక శిక్షణ ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమాన్ని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అకౌంటింగ్, ఫైనాన్స్ విభాగానికి చెందిన డాక్టర్ సుశోభన్ పాల్, డాక్టర్ మెరుగు వేణుగోపాల్ నిర్వహించనున్నారు. పాల్గొన్నవారికి అభ్యాస సామగ్రితో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు పేర్ల నమోదు, రుసుము వివరాల కోసం 84209 66501 నంబర్‌ను సంప్రదించాలని లేదా cbe@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని నిర్వాహకులు సూచించారు

పటాన్‌చెరుకు రూ.12 కోట్ల పారిశుధ్య కానుక

- తోషిబా నిధులతో 10 స్వీపింగ్ యంత్రాలు, 10 టిప్పర్లు..

- తొమ్మిది డివిజన్ల పరిశుభ్రతే లక్ష్యంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముందడుగు..

- పారిశుధ్య సిబ్బంది కొరత తీర్చాలని ప్రభుత్వానికి సూచన..



పటాన్‌చెరు, నవంబర్ 2 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న కాలనీలు, జనాభాకు అనుగుణంగా పారిశుధ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. తోషిబా పరిశ్రమ సామాజిక బాధ్యత నిధులు రూ. 12 కోట్లతో 10 స్వీపింగ్ యంత్రాలు,10 టిప్పర్లు కొనుగోలు చేశారు. సోమవారం పటాన్‌చెరు మైత్రి మైదానంలో తొలి విడతగా ఐదు స్వీపింగ్ యంత్రాలు,ఐదు టిప్పర్లను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, తోషిబా ప్రతినిధి మారు మోటో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పటాన్‌చెరు,అమీన్‌పూర్ సర్కిళ్ల పరిధిలోని తొమ్మిది డివిజన్లలో పారిశుధ్య సేవలను మెరుగుపరిచేందుకు ఆధునిక వాహనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.తొలి విడతలో అమీన్‌పూర్‌కు మూడు స్వీపింగ్ యంత్రాలు, మూడు టిప్పర్లు, పటాన్‌చెరుకు రెండు స్వీపింగ్ యంత్రాలు, రెండు టిప్పర్లు కేటాయించినట్లు వెల్లడించారు. బీహెచ్ఈఎల్ నుంచి ఇస్నాపూర్ వరకు జాతీయ రహదారి పరిశుభ్రతకు ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.తొమ్మిది డివిజన్లలో పెరుగుతున్న కాలనీలకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది కొరత ఉందని, ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు.ప్రతి డివిజన్‌కు స్వీపింగ్ యంత్రం, టిప్పర్,జేసీబీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు.తోషిబా పరిశ్రమ ప్రతినిధి మారు మోటో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ మాట్లాడుతూ,పారిశుధ్యానికి వాహనాలు సమకూర్చడంలో ఎమ్మెల్యే చొరవ అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్లు కావ్య, లలిత శ్రావణి, తోషిబా పరిశ్రమ ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు..

శిఖర గణపతి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఏర్పాట్లు

- నవంబర్ 4, 5 తేదీల్లో వైభవంగా ఉత్సవాలు

- గ్రామ సర్పంచ్ విస్లావత్ శ్రీను నాయక్



మహేశ్వరం, నవంబర్ 02, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం సార్ల రావులపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకునేలా శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామి శిఖర గణపతి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నా యని గ్రామ సర్పంచ్ విస్లావత్ శ్రీను నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. నవంబర్ 4వ తేదీన ఉదయం 9 గంటల నుంచి కాలవూజలు, హోమాలు, అధివానన కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు యజ్ఞం ప్రారంభం, 11:30 గంటలకు విశేషంగా ధ్వజాధివానం, ఆవాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1:30 గంటలకు పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని సర్పంచ్ శ్రీను నాయక్ తెలిపారు.సాయంత్రం 4:30 గంటల నుంచి సాయంకాల ఆరాధనలు, హోమాలు, పారాయణాలు నిర్వహించనున్నారు. 108 స్ఫటిక కలశాలతో విశేష ద్రవ్యాలతో మహాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7:30 గంటల నుంచి ప్రత్యేక పూజలు, హారతులు, ఇతర ధార్మిక కార్యక్రమాలు జరగనున్నాయని అన్నారు.నవంబర్ 5వ తేదీన ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామి శిఖర గణపతి ధ్వజస్తంభ విగ్రహ యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా జరగనున్నాయి.ఈ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని గ్రామ సర్పంచ్ శ్రీను నాయక్ కోరారు.



విద్యార్థుల ఇబ్బందులు తొలగించేందుకు బస్సు సర్వీసు నడపాలి.

డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన ప్రజాప్రతినిధులు.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 02.

సిద్దిపేట నుంచి వెంకట్రావుపేట, మంతూర్, అనాజీపూర్, రాయపోల్ గ్రామాల మీదుగా బస్సు సర్వీసు నడపాలని ప్రజాప్రతినిధులు కోరారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల నుంచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో నిత్యం కొన్ని కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తోందని తెలిపారు. విద్యార్థులతో పాటు ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాల మీదుగా బస్సు సర్వీసును ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంతూర్ సర్పంచ్ పర్వేజ్, ఉపసర్పంచ్ బంధారం సంతోష్, అనాజీపూర్ ఉపసర్పంచ్ వేణు, బీఆర్ఎస్ నాయకులు ఇస్తారీ, భాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినాయక్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల సమస్యలు పరిష్కరించాలి

పెండింగ్ పనులు త్వరితగతిన చేపట్టాలి.. అధికారులకు మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి విజ్ఞప్తి

మల్కాజిగిరి, నవంబరు 2 (ప్రజా కలం ప్రతినిధి): వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతులు, పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అధికారులను కోరారు. సోమవారం ఉదయం ఎంఎంసీ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనలో ఆమె పాల్గొని, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తరుణ్ ఎంక్లేవ్‌లో వీధి దీపాలను క్రమబద్ధీకరించడంతో పాటు, వర్షపు నీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కోరారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీ సమీపంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యూటర్న్ ఏర్పాటు చేయాలని సూచించారు. అదే ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించి ప్రాంతాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కోరారు. లక్ష్మీనగర్‌లో పార్కు అభివృద్ధి పనులు చేపట్టి స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అధికారులను కోరారు. అలాగే వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఆనంద్‌బాగ్ పార్కు ముందు రోడ్డు, ప్యారడైజ్ సమీపంలోని రోడ్డు, ఆనంద్‌బాగ్ ప్రధాన రహదారి పక్కన టేబుల్ డ్రెయిన్ నిర్మాణ పనులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సంబంధిత అనుమతులను త్వరితగతిన మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని క్యానం రాజ్యలక్ష్మి కోరారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ లక్ష్మణ్, ఏఈ నవీన్, సూపర్‌వైజర్లు సాగర్, రమేష్, పారిశుద్ధ్య విభాగం డీఈ లావణ్య, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ కిష్టమ్మ, ఉద్యానవన విభాగం సూపర్‌వైజర్ వెంకటేష్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు జయకుమార్, పవన్, ఎస్‌వీఎస్ సుబ్రమణ్యం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. క్యానం రాజ్యలక్ష్మితో పాటు బీజేపీ నాయకుడు ఓం ప్రకాష్ పాల్గొన్నారు.




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

ప్రజావాణికి 25 ఫిర్యాదులు

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి: జోనల్ కమిషనర్

మల్కాజిగిరి, నవంబరు 2 (ప్రజా కలం ప్రతినిధి): ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, వాటిని త్వరితగతిన పరిష్కరించి బాధితులకు ఉపశమనం కల్పించాలని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులను



ఆదేశించారు. సోమవారం మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్ల నుంచి మొత్తం 25 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో కీసర సర్కిల్ నుంచి అత్యధికంగా 16 ఫిర్యాదులు రాగా, మల్కాజిగిరి సర్కిల్ నుంచి 6, మౌలాలి సర్కిల్ నుంచి 2, అల్వాల్ సర్కిల్ నుంచి ఒక ఫిర్యాదు అందాయి. బోయిన్‌పల్లి సర్కిల్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను జోనల్ కమిషనర్ సమీక్షించి, ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించి, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జి. కవిత (విద్యుత్), టి. ప్రశాంతి (ఘన వ్యర్థాల నిర్వహణ), అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ కె. మంజుల, పశువైద్య అధికారి డాక్టర్ సంజయ్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు అజయ్, డి. శాంతిప్రియ తదితర అధికారులు పాల్గొన్నారు.



అమిత్ షా మహా పాదయాత్రకు బయలుదేరిన బీజేపీ నాయకులు

ఈసం రాకేష్ ఆధ్వర్యంలో తరలివెళ్లిన గౌతమ్ నగర్ డివిజన్ నాయకులు, మహిళా కార్యకర్తలు

మల్కాజిగిరి, నవంబరు 2 (ప్రజా కలం ప్రతినిధి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్న మహా పాదయాత్రలో పాల్గొనేందుకు బీజేపీ గౌతమ్ నగర్ డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. డివిజన్ అధ్యక్షుడు ఈసం రాకేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పాదయాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. మహా పాదయాత్రలో డివిజన్ తరపున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నట్లు నాయకులు తెలిపారు.

అమిత్ షా మహా పాదయాత్రలో పాల్గొన్న మాజీ చైర్మన్ మధుమోహన్

మహేశ్వరం, నవంబర్ 02, (ప్రజా కలం)

ప్రజా సామాన్ని కాపాడుకుందాం అరాచకాన్ని తరిమికొడదాం అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రంలో భారత హోంశాఖ మంత్రి అమిత్ షా మహా పాదయాత్ర కొనసాగుతోంది. ఇందులో భాగంగా శంషాబాద్ జీహెచ్ఎంసీ



పరిధిలోని తుక్కుగూడ 66వ డివిజన్ రావిరాల నుండి జరిగిన పాదయాత్రలో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కాంటె కార్ మధుమోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యాదగిరి రెడ్డి వై. శివకుమార్ గౌడ్, శక్తి కేంద్రం ఇంచార్జ్ తలారి శ్రీనివాస్ , నక్క కరుణాకర్ గౌడ్, లక్ష్మారెడ్డి, మల్లేష్ గౌడ్ , సాయి కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి ఒక రోజు జైలు.

బేగంపేట్ ఎస్ఐ టి. రేణుక.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 02.

మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఒక వ్యక్తికి న్యాయస్థానం ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు బేగంపేట ఎస్ఐ టి.రేణుక తెలిపారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తిని న్యాయస్థానంలో హాజరుపరచగా ఈ మేరకు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రేణుక మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు శిక్షతో పాటు రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని సూచించారు.



వీధి కుక్కల నిర్వహణలో శాస్త్రీయ, మానవీయ విధానాలు పాటించాలి

ఫతుల్లగూడ యానిమల్ కేర్ సెంటర్‌ను పరిశీలించిన ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



మల్కాజిగిరి, నవంబరు 2 (ప్రజా కలం ప్రతినిధి): జంతు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వీధి కుక్కల నిర్వహణను శాస్త్రీయంగా, మానవీయ పద్ధతుల్లో చేపట్టాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఫతుల్లగూడలోని యానిమల్ కేర్ సెంటర్‌ను సందర్శించిన ఆయన అక్కడి మౌలిక సదుపాయాలు, జంతువుల సంరక్షణ ఏర్పాట్లు, పశువైద్య సేవలు, వీధి కుక్కల నిర్వహణకు సంబంధించిన కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జంతు ప్రేమికులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశమైన కమిషనర్ జంతు సంరక్షణలో ఎదురవుతున్న సమస్యలు, సేవలను మరింత మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. యానిమల్ షెల్టర్ నిర్మాణ పనులను సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి కేంద్రాన్ని త్వరితగతిన పూర్తిస్థాయిలో అందుబా టులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. వీధి కుక్కలకు నిబంధనల ప్రకారం నంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు, టీకాలు వేయడంతో పాటు, పట్టుకున్న ప్రాంతంలోనే తిరిగి వదిలే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జంతువుల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూ వాటికి అవసరమైన వైద్య సేవలు, ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కేంద్రంలో అందుబాటులో ఉన్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరంతో పాటు ఇతర పశు వైద్య పరికరాల పనితీరును పరిశీలించారు. వాటి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. జంతువుల సంరక్షణ, చికిత్సకు సంబంధించిన రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచిం చారు. డాగ్ క్యాచింగ్ వాహనాల స్థితిగతులు, పరిశుభ్రతను పరిశీలించి, వాహనాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వినియోగానికి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అలాగే కేంద్రంలో జంతువులకు అందిస్తున్న ఆహారం, వైద్య సంరక్షణ ఏర్పాట్లను సమీక్షించారు. మృతి చెందిన జంతువుల మృతదేహాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేందుకు విద్యుత్ దహనవాటిక ఏర్పాటుపై కూడా అధికారులతో చర్చించారు. మున్సిపల్ పశువైద్య విభాగం, స్వచ్ఛంద సంస్థలు, జంతు సంక్షేమ సంఘాలు, ఆహారం అందించే కార్యకర్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వ యంతో వనిచేయాలని సూచించారు. పర్యటనలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు, పనుల పురోగతిని సమీక్షించేందుకు వచ్చే నెలలో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. జంతువుల పట్ల బాధ్యతా యుతమైన సంరక్షణ, శాస్త్రీయ నిర్వహణతో మల్కాజిగిరి ప్రాంతాన్ని జంతు సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేషన్ కృషి చేస్తోందన్నారు. ఈ పర్యటనలో చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, నాగోల్ డిప్యూటీ కమిషనర్ సంపత్ కుమార్, ఎస్ఈ నాగేందర్, పశువైద్య అధికారులు రంజిత్, సంజయ్, రామారావుతో పాటు పీపుల్ ఫర్ యానిమల్స్, అరుద్ర గ్రూప్, ఆసరా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జంతువులకు ఆహారం అందించే కార్యకర్తలు, డాగ్ క్యాచింగ్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.



ఓటు హక్కు పరిరక్షణ.. ప్రజాస్వామ్య పునాదుల బలోపేతమే లక్ష్యంగా ఓట్ చోర్ - దేశ్ బచావో కార్యక్రమం

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీ వేదికగా ఇండియా కూటమి పోరాటం తెలంగాణ భవన్ నుంచి ర్యాలీ..రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఢిల్లీ,నవంబర్ 02 (ప్రజా కలం)

దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడటమే లక్ష్యంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఓట్ చోర్ -- దేశ్ బచావో కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆలేరు నియోజకవర్గం నుంచి సుమారు 99 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో బీర్ల అయిలయ్య పాల్గొని, ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన నినాదాలతో ఉ ద్యమానికి సంఘీభావం తెలిపారు. అనంతరం న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో నిర్వహించిన ఇండియా కూటమి భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి చేస్తున్న డిమాండ్‌కు మద్దతుగా నిర్వహించిన ఈ సభలో పాల్గొని తమ గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది అని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా,నిష్పక్షపాతంగా సాగాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఓటు చోరీ ఆరోపణలు, ఎన్నికల వ్యవస్థలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రత,విశ్వ సనీయతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి,ప్రజల ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ,ఇండియా కూటమి చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గం నుంచి సుమారు 99 మంది నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తనతో కలిసి ఢిల్లీకి చేరుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమని బీర్ల అయిలయ్య తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ శ్రేణులు భాగస్వాములవుతాయని పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణ.. ప్రజాస్వామ్య పునాదుల బలోపేతమే లక్ష్యంగా ఓట్ చోర్ -- దేశ్ బచావో కార్యక్రమంలో ఆలేరు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాల్గొన్నామని బీర్ల అయిలయ్య తెలిపారు.

హైదరాబాద్‌లో హైడ్రా చర్యలు..

రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద కూల్చివేతలు

హైదరాబాద్ : రామాంతపూర్‌లో ఉన్న పెద్ద చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను 'హైడ్రా' అధికారులు కూల్చివేశారు. చెరువు స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడే చర్యల్లో భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న ఓ భారీ షెడ్డును అధికారులు తొలగించారు. అధికారుల చర్యలతో తాము తీవ్రంగా నష్టపోయామని ఆస్తుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 ఏళ్లుగా తాము క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని వారు తెలిపారు. గత మూడు రోజులుగా అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తాము హైకోర్టును ఆశ్రయించామని బాధితులు వివరించారు. ముందుగా చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని, ఆ తర్వాతే చట్టపరమైన తమ భూములపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలోనూ ఇదే చెరువు పరిధిలో కూల్చివేతలు చేపట్టి, కొంత భూమిని పునరుద్ధరణ పనుల కోసం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పార్వతీపురం మన్యంలో ఏనుగుల బీభత్సం

పార్వతీపురం మన్యం : పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామ సమీపంలో ఏనుగులు సంచరించడంతో స్థానిక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ, ఏనుగుల సంచారంతో ప్రాణభయం వెంటాడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏనుగుల దాడిలో తమ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయారని గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల దాడుల ఘటనలు తమను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయని చెబుతున్నారు. పంట పనులు వదులుకోలేక పొలాలకు వెళ్లాల్సి వస్తోందని, ఏ సమయంలో ఏనుగులు ఎదురవుతాయోనన్న ఆందోళనతో రైతులు బిక్కుబిక్కుమంటూ వ్యవసాయ పనులు చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని పెదబొండపల్లి రైతులు కోరుతున్నారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, గ్రామస్తులు మరియు రైతులకు ముందస్తు హెచ్చరికలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.. ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి అని పెదబొండపల్లి గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

అర్ధరాత్రి వేళ నిఘా మరింత పటిష్టం

జగిత్యాల : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు రాత్రి వేళ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు, దొంగతనాలు తదితర ఘటనలను అరికట్టేందుకు బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహించడంతో పాటు నైట్ బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిన్న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జిల్లా ఎస్పీ గారు జగిత్యాల, మెట్ పల్లి ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పెట్రోలింగ్ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాత్రి సమయంలో సమర్థవంతమైన పెట్రోలింగ్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. సమయానుకూలంగా స్పందిస్తూ నేరాలకు ముందుగానే అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలను నియంత్రించేందుకు రాత్రి నిఘాను మరింత పటిష్టం చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రజలు ప్రశాంతవాతావరణంలో జీవించేందుకు అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవం

కాకినాడ : ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.స్వాతంత్ర సమరయోధునిగానే కాకుండా స్వాతంత్రానంతరం సంస్థానాలు విలీనం కావడానికి గట్టి ప్రయత్నం చేసి సఫలుడైన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్. ఉక్కుమనిషి 151వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి డాక్టర్ నాయుడు, శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ మాట్లాడుతూ "భారతదేశ తొలి ఉప ప్రధాని, తొలి హోం మంత్రి 'సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్' జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని జరుపుకుంటామని , ాతిని ఏకతాటిపై నిలిపి, ఐక్యతకు చిరునామాగా నిలిచిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు.

రూ.62 వేల బంగారు నగలతో ర్యాపిడో రైడర్ పరార్

- వివో సంస్థ అడ్మిన్ మేనేజర్ దత్త ప్రసాద్‌కు చేదు అనుభవం..
- పెట్రోల్ ఖర్చుల పేరుతో అదనంగా రూ.100 వసూలు చేసి ఉడాయింపు

హైదరాబాద్ ; హైదరాబాద్‌లో ర్యాపిడో పార్శిల్ సేవను ఉపయోగించుకున్న ఓ వ్యక్తికి చేదు అనుభవం ఎదురైంది. బంధువుల ఇంటికి పంపించిన రూ.62,383 విలువైన బంగారు నగలతో ర్యాపిడో డెలివరీ రైడర్ పరారైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది.వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని వివో సంస్థలో అడ్మిన్ మేనేజర్‌గా పనిచేస్తున్న దత్త ప్రసాద్ నల్లపాటి తన బంధువులకు బంగారు నగలు పంపించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ర్యాపిడో బైక్ పార్శిల్ సేవను బుక్ చేశారు. ఈ క్రమంలో గీడిమెట్లకు చెందిన మురళి అనే ర్యాపిడో రైడర్ బైక్‌పై వచ్చి సెక్యూరిటీ గార్డు వద్ద పార్శిల్‌ను స్వీకరించాడు.ఆ పార్శిల్‌లో రూ.62,383 విలువైన బంగారు మెట్టెలు, రోజ్‌గోల్డ్ పట్టీలు ఉన్నట్లు తెలిసింది. పార్శిల్ తీసుకున్న అనంతరం పెట్రోల్ ఖర్చుల పేరుతో అదనంగా రూ.100 కావాలని రైడర్ కోరడంతో దత్త ప్రసాద్ ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించారు.అయితే కొంతసేపటి తర్వాత కూడా పార్శిల్ నాగోలులోని బంధువుల ఇంటికి చేరకపోవడంతో దత్త ప్రసాద్ రైడర్‌కు ఫోన్ చేశారు. రైడర్ అందుబాటులోకి రాకపోవడంతో బంధువులను సంప్రదించగా పార్శిల్ అందలేదని తెలిపారు. తిరిగి రైడర్‌కు ఫోన్ చేయగా బాధితుడి నంబర్‌ను బ్లాక్ చేసినట్లు గుర్తించారు.దీంతో బాధితుడు ర్యాపిడో కస్టమర్ కేర్‌ను సంప్రదించినప్పటికీ సరైన స్పందన రాకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.విలువైన వస్తువుల పంపిణీలో అప్రమత్తత అవసరం ఆన్‌లైన్ డెలివరీ సేవలను వినియోగించుకునే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.